# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 10-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- అంతర్జాతీయంగా మానవ హక్కుల మార్గదర్శకాలను రూపొందించడంలో భారతదేశం ముఖ్యమైన పాత్ర పోషించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- యునెస్కో అవ్యక్తమైన సాంస్కృతిక వారసత్వ జాబితాలో దీపావళి పండుగ చోటు దక్కించుకుంది.
- లోక్ సభ లో ఎన్నికల సంస్కరణల అంశంపై ఈరోజు చర్చ చేపట్టారు.
- అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఇప్పటివరకు 160 రైల్వే స్టేషన్లలో అభివృద్ధి పనులను పూర్తి చేశామని ఆ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయంగా మానవ హక్కుల మార్గదర్శకాలను రూపొందించడంలో భారతదేశం ముఖ్యమైన పాత్ర పోషించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో ద్రౌపది ముర్ము ప్రసంగిస్తూ... భారత రాజ్యాంగ సభలోని 15 మంది మహిళా సభ్యులలో ఒకరైన హంసా మెహతా సార్వత్రిక మానవ హక్కుల ముసాయిదా రూపకల్పనకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. దేశంలో మానవ హక్కులను కాపాడటమే కాకుండా ఒక జాతిగా ఉండడానికి భారతదేశం కట్టుబడి ఉందని అన్నారు. గౌరవం అనేది అందరికి సమానమేనని, ఎవరూ వారి హక్కులను కోల్పోకూడదని రాష్ట్రపతి ఉద్ఘాటించారు. మానవ హక్కుల దినోత్సవం న్యాయమైన, సమానమైన సమాజానికి నేపథ్యంగా నిలుస్తుందని చెప్పారు. దేశంలోని ప్రతి వ్యక్తికి న్యాయం జన్మహక్కుగా ఉండాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారతీయులు ఎంతో ఇష్టంగా జరుపుకునే దీపావళి పండుగకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. యునెస్కో అవ్యక్తమైన సాంస్కృతిక వారసత్వ జాబితాలో దీపావళి పండుగ చోటు దక్కించుకుంది. న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జరుగుతున్న ఇంటాంజబుల్ కల్చరల్ హెరిటేజ్ సమావేశాల్లో భాగంగా అంతర ప్రభుత్వ కమిటీ 21వ సమావేశంలో యునెస్కో ప్రతినిధులు ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. యునెస్కో ఇప్పటికే భారతదేశానికి చెందిన 15 అంశాలకు వారసత్వ గుర్తింపు ఇచ్చింది. ఈ జాబితాలో కుంభమేళా, కలకత్తా దుర్గా పూజ, గుజరాత్లోని గర్బా నృత్యం, యోగా, వేద పఠన సంప్రదాయం, రామలీల మొదలైనవి ఉన్నాయి. భారతీయులు అత్యంత సంప్రదాయబద్ధంగా జరుపుకునే ఈ పండుగను యునెస్కో జాబితాలో చేర్చడంపై కేంద్ర సాంస్కృతిక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఆనందం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దీపావళి పండుగ యునెస్కో జాబితాలో చోటు దక్కించుకోవడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ... యునెస్కో ప్రకటనకు భారతీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు భావోద్వేగానికి లోనయ్యారని

సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్ట్ లో పేర్కొన్నారు. దీపావళి.. దేశ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలతో ప్రత్యేక అనుబంధం కలిగి ఉందన్నారు. ఇది మన నాగరికతకు ఆత్మ వంటిదని, దేదీప్యమానమైన ధర్మానికి ప్రతీక అని అన్నారు. యునెస్కో అమూర్త వారసత్వ జాబితాలో దీపావళిని చేర్చడం వల్ల ఈ వేడుకకు ప్రపంచ ప్రజాదరణ మరింత పెరుగుతుందన్నారు. అదే విధంగా యునెస్కో నిర్ణయాన్ని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఎక్స్ వేదికగా స్వాగతించారు. ఈ ప్రపంచ గుర్తింపు దేశ పౌరులందరికీ గర్వకారణమన్నారు. దీపావళి కేవలం ఒక పండుగ మాత్రమే కాదని, దేశాన్ని ఏకం చేసే నాగరికత దృగ్విషయం అని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ పౌరులు మరచిపోయిన, క్లెయిమ్ చేయని తమ ఆర్థిక ఆస్తులను తిరిగి పొందేందుకు 2025 అక్టోబర్లో ప్రభుత్వం ప్రారంభించిన 'మీ డబ్బు, మీ హక్కు' ఉద్యమంలో భాగస్వాములు కావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలు మరిచిపోయిన డిపాజిట్లు, బీమా సొమ్ము, డివిడెంట్లు మొదలైన ఆస్తులను తిరిగి పొందేందుకే దీనిని తీసుకొచ్చినట్లు ప్రధానమంత్రి లింక్డ్ ఇన్ పోస్ట్ ద్వారా తెలియజేశారు. దీని ద్వారా ఇప్పటి వరకు దాదాపు 2 వేల కోట్ల రూపాయల విలువైన ఆస్తులను అసలైన యజమానులకు తిరిగి అప్పగించామని తెలిపారు. ప్రతి పౌరుడు చట్టబద్ధంగా తమకు దక్కాల్సిన ఆస్తులను ఈ పథకం ద్వారా క్లెయిమ్ చేయవచ్చన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

లోక్ సభలో ఎన్నికల సంస్కరణల అంశంపై ఈరోజు చర్చను తిరిగి చేపట్టారు. హోంమంత్రి అమిత్ షా ఈ చర్చలో మాట్లాడుతూ ఎన్నికల ప్రత్యేక సమగ్ర సవరణ SIR పై విపక్షాలు అసత్యాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. SIR అంశంపై అబద్ధాలను వ్యాప్తి చేసి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాలను తయారు చేయడంలో ఎన్నికల సంఘానికి రాజ్యాంగం పూర్తి స్వేచ్ఛను కల్పించిందని, SIR ప్రక్రియ చేపట్టడం ఎన్నికల కమిషన్ బాధ్యత అని గతంలోనూ ఇది చాలా సార్లు జరిగిందని అమిత్ షా సభకు తెలియజేస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

అంతకముందు లోకసభలో ప్రతిపక్ష నాయకుడు, రాహుల్ గాంధీ ఎన్నికల సంస్కరణలపై మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్ల అంశాన్ని ప్రస్తావించించారు. దీనికి కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ బదులిస్తూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఎన్నికల కమిషన్ తో సహా అన్ని రాజ్యాంగ సంస్థలు పారదర్శకంగా పనిచేస్తున్నాయని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రైల్వేలో మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. లోక్సభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. అనేక రైల్వే స్టేషన్లలోనూ, రైల్వే బోగీల్లోనూ సిసిటీవీ కెమెరాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఇక అమృత్ భారత్ స్టేషన్ పథకానికి సంబంధించిన ప్రశ్నకు అశ్విని వైష్ణవ్ సమాధానమిస్తూ.. ఈ పథకం కింద 1300 కి పైగా రైల్వే స్టేషన్లను గుర్తించామని అందులో భాగంగా ఇప్పటివరకు 160 స్టేషన్లలో అభివృద్ధి పనులను పూర్తి చేశామని వివరిస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

లోక్ సభలో మరొక ప్రశ్నకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖా మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమాధానమిస్తూ... గత 11 సంవత్సరాలలో పోస్టల్ నెట్వర్క్ ను 10 వేల 170 పోస్టాఫీసులతో విస్తరించినట్లు చెప్పారు. భారత పోస్టల్ వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద పోస్టల్ వ్యవస్థ అని, దేశవ్యాప్తంగా ఒక లక్ష 64 వేల పోస్టాఫీసులు ఉన్నాయని వెల్లడించారు. వీటిలో దాదాపు 2.78 లక్షల మంది గ్రామీణ డాక్ సేవకులు పోస్టల్ సేవలందిస్తున్నారని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ దిగ్గజం అమెజాన్, 2030 నాటికి భారతదేశంలో 35 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. న్యూఢిల్లీలో జరిగిన అమెజాన్ సంభవ్ సమ్మిట్ 6వ ఎడిషన్ లో అమెజాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అమిత్ అగర్వాల్ ఈ విషయాన్ని ఈరోజు వెల్లడించారు. ఈ పెట్టుబడి వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఇది 10 లక్షలమందికి నూతన ఉపాధి అవకాశాలను

సృష్టిస్తుందన్నారు. AI సామర్థ్యాలను విస్తరించడం, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం తద్వారా చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వడంపై ఈ పెట్టుబడి దృష్టి సారిస్తుందన్నారు. అంతకుముందు, భారతదేశపు AI భవిష్యత్తు కోసం మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సార్వభౌమ సామర్థ్యాలను నిర్మించడానికి మరో టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, 17 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది.

= = = = = = = = = = = = = = = = = = =

ఆసియా అభివృద్ధి బ్యాంకు (ADB) 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను భారతదేశ వృద్ధి అంచనాను 7.2 శాతానికి సవరించింది. భారతదేశ వృద్ధి అంచనా 6.5 శాతంగా ఉండవచ్చని గతంలో వెల్లడించిన ADB జూలై నుండి సెప్టెంబర్ త్రైమాసికంలో దేశం బలమైన వృద్ధిని నమోదు చేసిన తర్వాత 0.7 శాతం పాయింట్ల పెరుగుదలను సూచిస్తోందని తన ఆసియా, పసిఫిక్ వృద్ధి అంచనాల నివేదికలో పేర్కొంది. మల్టీ లేటరల్ డెవెలప్మెంట్ బ్యాంకు మాత్రం భారతదేశ వృద్ధి అంచనా 6.5 శాతం వద్దే ఉంటుందని ఉద్ఘాటించింది.

= = = = = = = = = = = = = = = = = = =

స్క్వాష్ ప్రపంచ కప్-2025 కు భారతదేశం ఆతిథ్యమిస్తోంది. చెన్నైలోని ఎక్స్ ప్రెస్ అవెన్యూ మాల్‌లో ఈరోజు జరిగిన పూల్ బి తొలి మ్యాచ్ లో భారత్ 4-0 తేడాతో స్విట్జర్లాండ్‌ను ఓడించింది. భారత్ తన తదుపరి మ్యాచ్ ను రేపు బ్రెజిల్‌తో ఆడనుంది. కాగా 2023 లో జరిగిన స్క్వాష్ ప్రపంచ కప్ లో భారత్ కాంస్య పతకం గెలుచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =